క్లుప్తంగా

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

యలమంచిలి రూరల్ : స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో భౌతికశాస్త్రం, గణిత శాస్త్రం సబ్జెక్టులు బోధించుటకు అతిథి అధ్యాపకులు కావాలని, ఆసక్తి ఉన్న అభ్యర్థులు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని యలమంచిలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.విజయ్‌కుమార్ మీడియాకు విడుదల చేసిన ప్రకటనలో మంగళవారం తెలిపారు. అభ్యర్థులు సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు.

స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతుల పరిశీలన



హిందీ శిక్షణ తరగతులను పరిశీలిస్తున్న జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి పట్నాయక్

మునగపాక: తిమ్మరాజుపేట, నాగులాపల్లి హైస్కూళ్లలో జరుగుతున్న స్కూల్ కాంప్లెక్స్ శిక్షణ తరగతులను మంగళవారం జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి ఎం.ఎం.పట్నాయక్ పరిశీలించారు. తిమ్మరాజుపేట హైస్కూల్లో హిందీ శిక్షణ తరగతులను పరిశీలించిన ఆయన బోధన పద్ధతులు మరింత పెంచాలన్నారు. ఉపాధ్యాయులు సంబంధిత భాషపై మరింత పట్టు సాధించాలన్నారు. ఇటువంటి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట పరిశీలకులు ఎం.శివనాయుడు, హెచ్‌ఎం జి.అప్పారావు, సీఆర్‌ఎంటీ కె.లక్ష్మీనారాయణ, ఆర్‌పీలు చందన, దేవకి, శైలజ తదితరులున్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి



వాడ్రాపల్లిలో ర్యాలీని ప్రారంభిస్తున్న సర్పంచ్ నూకరాజు

మునగపాక: ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు కోరారు. వాడ్రాపల్లిలో మంగళవారం దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించేందుకు ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సీజన్‌లో అంటు రోగాలు ప్రబలకుండా చూడాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి ఆవరణలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది,గ్రామస్తులు పాల్గొన్నారు.


హెల్త్ సెంటర్‌కు కుర్చీల వితరణ



ఆయుష్మాన్ భారత్ హెల్త్ కేంద్రానికి కుర్చీలు బహూకరిస్తున్న దృశ్యం

మునగపాక: మండలంలోని నాగులాపల్లి పాటిమీద ఆయుష్మాన్ భారత్ హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌కు అదే గ్రామానికి చెందిన ఆంద్ర మల్లేష్, మావూరి సంతోష్ కలిసి 15 కుర్చీలను మంగళవారం వితరణగా అందజేశారు. మన ఊరు–మన బాధ్యతలో భాగంగా తమ వంతు సాయం అందజేయడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కుర్చీలను సెంటర్‌లో పనిచేసే ఉద్యోగులకు అప్పగించారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



మునగపాకలో మొక్కలు నాటుతున్న దృశ్యం

మునగపాక : ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి కోరారు. ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ జన్మదినం సందర్భంగా మంగళవారం మునగపాకలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు ముసిలినాయుడు, టెక్కలి పరశురామ్, బొడ్డేడ అప్పలనాయుడు, వేగి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. నందీశ్వర ప్రాంగణంలో రక్తదాన శిబిరం నిర్వహించి పేదలకు నిత్యావసర సరకులను జనసేన ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి సుందరపు సతీష్‌కుమార్ చేతుల మీదుగా అందజేశారు.

నరకానికి నకళ్లు... ఆర్ అండ్ బీ రోడ్లు



నర్సీపట్నం రైల్వేస్టేషన్ సమీపంలో రోడ్డుపైకి గుబురుగా పెరిగిన ముళ్లపొదలు

- మరమ్మతులకైనా నోచని వైనం
- రోడ్లకిరువైపులా పెరిగిన తుప్పలు
- వాహనదారులకు నిత్యం కష్టాలు



సమస్యాత్మకంగా మారిన నర్సీపట్నం- అడ్డురోడ్డు ఆర్అండ్‌బీ రోడ్డు

ఎస్.రాయవరం: మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్లు నరకాన్ని తలపిస్తున్నాయని వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్లపై ఏగ్రామానికి వెళ్లాల్సి వచ్చినా అత్యంత జాగ్రత్తగా వాహనాలు నడపాల్సి వస్తోందని చెబుతున్నారు. అడ్డురోడ్డు నుంచి దార్లపూడి వెళ్లే కోటవురట్ల మండలం రామచంద్రపురం జంక్షన్ శివారు వరకు అత్యంత దారుణంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఈ రోడ్డు సుమారు 15 కిలోమీటర్ల మేర అడుకో గొయ్యి పడి ప్రయాణికులకు ప్రమాదాలు కొనితెస్తున్నాయి. రేవుపోలవరం నుంచి బంగారమ్మపాలెం వెళ్లే రోడ్డు సుమారు 3 కిలోమీటర్ల మేరకు భారీ వాహనాల రాకపోకలతో శిథిలమైంది. నిర్మాణానికి నోచుకోని పేటసూదిపురం రోడ్డు, వమ్మవరంరోడ్డు నిత్యం నరకంగా మారాయి. ఎస్.రాయవరం నుంచి యలమంచిలి వెళ్లే రోడ్డు కూడా రోడ్డుపై ఎక్కడికక్కడే వర్షపునీరు నిలిచిపోయి ఇబ్బందికరంగా మారాయి. ఈ గతుకులకు తోడు ఇటీవల వర్షాలకు రోడ్డుకిరువైపులా ఉన్న ముళ్లపొదలు గుబురుగా పెరిగి రోడ్డు మీదకు వచ్చాయి. ఎదురెదురు వాహనాలు దగ్గరగా వచ్చేవరకు కంట పడక పలు సందర్భాల్లో యాక్సిడెంట్లు కూడా జరుగుతున్నాయని వాపోతున్నారు. ఈ సమస్య ఎక్కువగా నర్సీపట్నం రోడ్డు రైల్వేస్టేషన్ , రేవపోలవరం నుంచి బంగారమ్మపాలెం వైపు యలమంచిలి నుంచి సర్వసిద్ధి ఉన్న వరకు రోడ్డు ఎస్.రాయవరం నుంచి వాకపాడు, వెంకటాపురం నుంచి లింగరాజుపాలెం వరకు రోడ్లకు ముళ్లపొదలు సమస్య ఉంది. దీంతో మండలంలో ఏ రోడ్డు సక్రమంగా లేదని వాహన చోదకులతో పాటు, మండలవాసులు కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కనీస మరమ్మతులైనా లేవు



దార్లపూడి నుంచి అడ్డురోడ్డు జంక్షన్‌కు వెళ్లేందుకు గతుకుల రోడ్డుతో నానా అవస్థలు పడుతున్నాం. కనీసం మరమ్మతులైనా చేపట్టాలి. ఈ గతుకులు కారణంగా చాలా ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి.

– కళిరెడ్డి నాగేశ్వరరావు, దార్లపూడి

ప్రతిపాదనలు పంపాం



ఎస్.రాయవరం మండలంలో దార్లపూడి, బంగారమ్మపాలెం, పి.ధర్మవరం రోడ్లకు తాత్కాలిక మరమ్మతులకు నిధుల విడుదలకు ప్రతిపాదన పంపాం. నిధులు విడుదల కాగానే రోడ్డు మరమ్మతులు చేపడతాం. అదే సమయంలో మెయింటెనెన్స్ పనులు ముళ్లపొదలు తొలగింపు పనులు చేపడతాం.

– పద్మిని, ఆర్‌అండ్‌బీ జేఈ, నక్కపల్లి డివిజన్

వాహన చోదకులకు తిప్పలే...



చినగుమ్ములూరు సమీపంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై గతుకులతో పాటు , రోడ్డుపక్క ముళ్ల పొదలు కూడా పెరిగిపోయాయి. నిత్యం వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు వెంటనే పనులు చేపట్టాలి.

– మైలారు శ్రీనివాసరావు, చినగుమ్ములూరు

దోమలను నివారించాలి



సర్వసిద్ధి పీహెచ్‌సీ వద్ద ర్యాలీలో పాల్గొన్న వైద్యులు వాసంతి



హరిపాలెంలో దోమల నివారణపై అవగాహన కల్పిస్తూ ప్రచారం

ఎస్.రాయవరం: దోమల నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగిఉండాలని సర్వసిద్ధి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్.వాసంతి అన్నారు. సర్వసిద్ధి, పెనుగొల్లు పీహెచ్‌సీల పరిధిలో ఎస్.రాయవరం, గోకులపాడు గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. దోమల వ్యాప్తి వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఎస్.రాయవరం, సర్వసిద్ధి పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొనగా, గోకులపాడు గ్రామంలో పెనుగొల్లు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

అచ్యుతాపురం: దోమల నివారణ పట్ల ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని హరిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి వసంత్‌కుమార్ అన్నారు. హరిపాలెంలో దోమల నివారణ దినోత్సవం సందర్భంగా మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాల్లో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటాయని, వాటి వల్ల వ్యాధులు వ్యాప్తి చెందుతాయని అన్నారు. అందువల్ల నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్య విస్తరణాధికారి శ్రీనివాస్, ఆరోగ్య పర్యవేక్షకులు సునీత,ఉమామహేశ్,వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఉప్పవరం గ్రామంలో డాక్టర్ మంజూష ఆధ్వర్యంలో దోమల ద్వారా సంక్రమించే వ్యాధుల గురించి వివరిస్తూ సదస్సు, ర్యాలీ నిర్వహించారు.

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై దుశ్చర్యను ఖండిస్తూ నిరసన



హరిపాలెం హైస్కూల్ ప్రాంగణంలో నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ సభ్యులు



అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారం నిర్వహిస్తున్న ప్రజా సంఘాలు

అచ్యుతాపురం: మండలంలోని హరిపాలెం ఉన్నత పాఠశాల వద్ద మంగళవారం ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షురాలు వి.శ్రీలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కోల్‌కతాకు చెందిన వైద్య విద్యార్థిని పట్ల దుండగులు చేసిన దుశ్చర్యను ఖండిస్తూ తక్షణమే నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూనియన్ మండల అధ్యక్షుడు నానాజీ, కె.సుభాషిణీ దేవి, మారిసెట్టి వెంకట అప్పారావు, దురాయి వెంకట సత్యనారాయణ, అరుణ పాల్గొన్నారు.

కోల్‌కతాలో వైద్య విద్యార్థినిపై జరిగిన హత్యాచారానికి నిరసనగా ప్రజా సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురం జంక్షన్‌లో ర్యాలీ,మానవహారం నిర్వహించారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆర్.రాము, వైద్యులు ధర్మిరెడ్డి వెంకట్,అడిగర్ల సుధీర్ మాట్లాడుతూ యావత్ భారతావని సిగ్గుపడేలా దుండగులు చేసిన ఈ దురాఘాతానికి నిరసన చేపట్టామని, ఆయా నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నిరసనలో డాక్టర్ ఎస్.నాయుడు, స్వాతి, కె.సోమునాయుడు, బి.శ్రీనివాసరావు, శివకృష్ణ, రాజాన అప్పలనాయుడు, ఆడారి సన్యాసిరావు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించాలి



ఎంఈవో కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పారిశుధ్య కార్మికులు, ఎండీఎం నిర్వాహకులు

యలమంచిలి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు, మధ్యాహ్న భోజన పథకం వర్కర్లకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం యలమంచిలి ఎంఈవో కార్యాలయం వద్ద మండలానికి చెందిన పారిశుధ్య కార్మికులు ఆందోళన చేశారు. 6 నెలలుగా స్కూళ్లలో పనిచేస్తున్న ఆయాలకు, నెలరోజులుగా ఎండీఎం వర్కర్లకు వేతనాలు చెల్లించకపోవడంతో వారంతా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని మధ్యాహ్న భోజన పథకం వర్కర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు శ్రీదేవి అన్నారు. ఇక నిత్యం స్కూళ్లలో పారిశుధ్యాన్ని మెరుగుపరచే శానిటేషన్ వర్కర్లకు 6 నెలలుగా వేతనాలు చెల్లించకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. విద్యా వ్యవస్థను బాగు చేస్తామంటూ ప్రభుత్వ పెద్దలు తరచూ ప్రకటిస్తూ పారిశుధ్య కార్మికుల వేతనాలు చెల్లించకుండా జాప్యం చేయడం తగదన్నారు. అదే విధంగా పారిశుధ్య, ఎండీఎం వర్కర్లపై ఇటీవల రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని, వాటిని ఆపాలని ఆందోళనకారులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ వినతిపత్రాన్ని ఎంఈవో అరుణ్ కుమార్‌కు అందజేశారు.

హనుమాన్ చాలీసా పారాయణం



ఆలయంలో పారాయణం చేస్తున్న భజన బృందం

నక్కపల్లి : స్థానిక అభయాంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం నిర్వహించినట్లు నిర్వాహకులు శ్రీపాదప్రణవ్‌రామ్ తెలిపారు. ఆంజనేయస్వామి భజన బృందం మహిళలు కార్యక్రమంలో పాల్గొన్నట్లు తెలిపారు. శ్రావణమాసంలో ప్రతి మంగళవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. స్వామివారికి ఉదయం తమలపాకు పూజలు, అభిషేకాలు నిర్వహించామని తెలిపారు.

లా అండ్ ఆర్డర్ పరిరక్షణకు కృషి



సీఐ కుమార స్వామి

నక్కపల్లి : నక్కపల్లి సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని, కొత్తగా నియమితులైన సీఐ కుమారస్వామి తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సీఐ (ఎస్‌హెచ్‌వో)గా ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ మండలంలో సంఘ వ్యతిరేక, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపట్ల కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గంజాయి రవాణా, గ్రామాల్లో చోరీ ఘటనలపైనా ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. జాతీయ రహదారిపై అనుమానం కలిగిన అన్ని వాహనాలను తనిఖీ చేయడం జరుగుతుందని, అలాగే పేకాట, కోడిపందాలు, ఇతర జూదాలపై కఠినంగా వ్యవహరిస్తామన్నారు. గణపతి నవరాత్రుల్లో మండపాల వద్ద ఏర్పాటు చేసే సాంస్కృతిక కార్యక్రమాలకు నిర్వాహకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలన్నారు. అశ్లీల నృత్యాలు రికార్డింగ్ డాన్సులు నిర్వహిస్తే కేసులు తప్పవన్నారు. ఆటో వాలాలు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్నా, అనుభవం లేని వారికి లైసెన్స్ లేని వారికి ఆటోలు ఇచ్చినా యజమానులపై కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసులు తీసుకునే చర్యలకు ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేసే వైద్య సిబ్బందిపై దురుసుగా ప్రవర్తించే వారి పట్ల కూడా కఠినంగా వ్యవహరిస్తామన్నారు. కళాశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో ర్యాగింగ్‌కు అడ్డుకట్ట వేసేలా విద్యార్థుల్లో అవగాహన కల్పిస్తామన్నారు. టోల్‌గేట్ పరిసర ప్రాంతాల్లో నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు.

వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి విరాళం



ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

మునగపాక : కలియుగ దైవం శ్రీనివాసుని ఆలయ నిర్మాణంలో పలువురు దాతలు ముందుకొస్తున్నారు. తమవంతు సాయం అందజేస్తున్నారు. రూ.4 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న ఆలయ పనులు చురుగ్గా సాగుతున్నాయి. దీనిలో భాగంగా పాయకరావుపేటకు చెందిన యల్లపు రామ సత్యనారాయణ కుమారుడు వెంకట సుభాష్ తనవంతు సాయంగా రూ.10,115 నగదును ఆలయ కమిటీ సభ్యులకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు కాండ్రేగుల జగ్గారావు, టెక్కలి కొండలరావు, వెలగా శ్రీనివాసరావు, ఆడారి లక్ష్మణరావు, మోహనరావు, విల్లూరి మోహన్, కిష్టప్ప పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



హరిపురంలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

రాంబిల్లి (యలమంచిలి): రక్తదానం ప్రాణదానంతో సమానమని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ అన్నారు. ఆయన పుట్టిన రోజు సందర్భంగా మంగళవారం రాంబిల్లి మండలం హరిపురం గ్రామంలో వేడుకలు నిర్వహించారు. అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి హరిపురం జనసేన కార్యాలయంలో రక్తధాన శిబిరం ప్రారంభించారు. వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే సుందరపుకు పుష్పగుచ్ఛాలు శాలువాలు కప్పి అభినందనలు తెలిపారు. రాంబిల్లి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వి.దినబాబు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో రక్తదాన శిబిరం



శిబిరంలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

పాయకరావుపేట : శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల 48వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా స్పేసెస్ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ తమ విద్యార్థులు 2004 నుంచి ఏటా తమ విద్యా సంస్థల వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ ఇప్పటివరకూ సుమారు 2200 యూనిట్ల రక్తదానం చేసి సేవానిరతి చాటుకున్నారని అన్నారు. మంగళవారం జరిగిన రక్తాదాన శిబిరం ద్వారా 60 యూనిట్ల రక్తాన్ని మదర్ బ్లడ్ బ్యాంకుకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.సత్యనారాయణ, మదర్ బ్లడ్ బ్యాంకు డైరెక్టర్ డి.శివ గుప్త, స్పేసెస్ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్, రోటరాక్టు యంగ్ లీడర్స్, సబల విద్యార్థులు పాల్గొన్నారు.

భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న అంబేద్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ బుజ్జిబాబు

మునగపాక : ఎస్సీ రిజర్వేషన్ ఉప వర్గీకరణకు రాష్ట్రాలకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పునకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహించనున్న భారత్‌బంద్‌ను విజయవంతం చేయాలని అంబేద్కరిజం పునాది అసోసియేషన్ కన్వీనర్ రాజాన బుజ్జిబాబు కోరారు. మునగపాక పీఏసీఎస్ కార్యాలయం ఆవరణలో మంగళవారం దళిత నేతలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. బుజ్జిబాబు మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు కారణంగా మాల–ఉపకులాలు నష్టపోవడమే కాకుండా ఎస్సీ రిజర్వేషన్‌ను పూర్తిగా ఎత్తివేయాలనే భావన ఉందన్నారు. ఇందుకోసం సుప్రీంతీర్పును పునః పరిశీలించాలని కోరుతూ 21న జరిగే భారత్‌బంద్‌కు సహకరించాలన్నారు. కార్యక్రమంలో దళితనేతలు కోనపల్లి రామ్మోహనరావు, పిల్లి అప్పారావు, గుంట్ల అప్పారావు,విష్ణు, పిట్టా అప్పారావు,లంబా అర్జునరావు, దిమ్మల శివ, ప్రసాద్, నవీన్ పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

నక్కపల్లి : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 11గంటలకు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో వివిధ శాఖలకు సంబంధించిన పనితీరు, ప్రజా సమస్యలపై చర్చించడం జరుగుతుందన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అన్ని ప్రభుత్వ శాఖల సిబ్బంది ఈ సమావేశానికి హాజరు కావాలని కోరారు.

తడి,పొడి చెత్తపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న డీఎల్‌డీవో మంజులావాణి

మునగపాక : గ్రామాల్లో సంపద తయారీ కేంద్రాలు అందుబాటులోకి తీసుకురావాలని డీఎల్‌డీవో మంజులావాణి కోరారు. మునగపాక మండల పరిషత్ హాలులో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వ్యవసాయ శాఖ సహాయ అధికారులు, ఉద్యానవన శాఖ అసిస్టెంట్లతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సంపద తయారీ కేంద్రాల ద్వారా పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందన్నారు. ప్రజల్లో తడి, పొడి చెత్తపై అవగాహన కల్పించాలన్నారు. ఈ నెల 23న ప్రతి పంచాయతీలో ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభ నిర్వహించాలన్నారు. ఎంపీడీవో ఎం.మన్మథరావు, ఈవోఆర్డీ వెంకటలక్ష్మి, వ్యవసాయాధికారి జ్యోత్స్నకుమారి, పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్, వెలుగు ఏపీఎం కొండమ్మ, ఉపాధిహామీ పథకం ఏపీవో ఎరకయ్య పాల్గొన్నారు.

గ్రామసభలను విజయవంతం చేయండి..



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి ఉదయశ్రీ

కోటవురట్ల : ఈ నెల 23వ తేదీన జరగనున్న ప్రత్యేక గ్రామసభలను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఉదయశ్రీ సూచించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో సచివాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, అగ్రికల్చర్ అసిస్టెంట్లతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సమస్యల గుర్తింపుపై నిర్వహించనున్న ప్రత్యేక గ్రామసభలకు విధిగా అధికారులు హాజరు కావాలన్నారు. ముందుగా ప్రజలకు సమాచారం అందించి విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏపీఎం రమణకుమారి, ఏపీవో గంగునాయుడు పాల్గొన్నారు.

ఏకాగ్రతతో చదువుకుంటే మంచి ఫలితాలు



మెరిట్ సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

మునగపాక : విద్యార్థులు ఏకాగ్రతతో చదువుకొని మంచి ఫలితాలు సాధించాలని నేషనల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.ఎం. ప్రసాద్ కోరారు. మునగపాక రాధాకృష్ణ ఫంక్షన్ హాలులో మంగళవారం నేషనల్ జూనియర్, డిగ్రీ కళాశాలల ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇష్టపడి కష్టపడి చదువుకోవాలని ఆకాంక్షించారు. లక్ష్యం కోసం చదువుకుంటే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. కార్యక్రమంలో డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ కె.బాలసంజీవరావు, వైస్ ప్రిన్సిపాల్ కె.ఈశ్వరరావు, డైరెక్టర్లు బి.మహేష్, బి.శంకరరావు, డిగ్రీ కళాశాల డైరెక్టర్లు బి.రమేష్,అధ్యాపకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం : కొరుప్రోలు సబ్‌స్టేషన్ పరిధిలో మెయింటెనెన్స్ పనుల కారణంగా బుధవారం కూడా విద్యుత్ సరఫరా నిలుపుతున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. గుడివాడ, గుర్రాజుపేట ,బంగారమ్మపాలెం పరిశ్రలకు, చినఉప్పలం ఆక్వా చెరువులకు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని సూచించారు.

సంపద కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నక్కపల్లి : గ్రామాల్లో ఏర్పాటు చేసిన సంపద తయారీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, వీటిపై గ్రామస్తులకు అవగాహన కల్పించాలని డీపీఆర్‌సీ జిల్లా కోఆర్డినేటర్ నాగలక్ష్మి కోరారు. మంగళవారం ఆమె గొడిచర్లలో సంపద తయారీ కేంద్రంలో హరిత రాయబారులు, కార్యదర్శులకు అవగాహన సదస్సు నిర్వహించారు. గ్రామంలో నుంచి తడిపొడి చెత్తను సేకరించి, దానిని వేరు చేసే విధానంపై అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు చేసి తద్వారా వర్మికంపోస్టు తయారు చేయడానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యనారాయణ, ఎంపీటీసీ సభ్యురాలు నిట్ల దేవి గోవిందు, సర్పంచ్ అల్లు పార్వతి రమణ, కార్యదర్శులు పాల్గొన్నారు.

మెరుగైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి

పెందుర్తి : మెరుగైన యాజమాన్య పద్ధతులతో వ్యవసాయం చేస్తే అధిక దిగుబడి వస్తుందని జిల్లా వ్యవసాయాధికారి కె.అప్పలస్వామి అన్నారు. అందుబాటులో ఉన్న ఆధునిక వనరులను వినియోగించుకుని వ్యవసాయం చేయడం వల్ల రైతులకు ఆర్థికంగా మేలు జరుగుతుందని చెప్పారు. నరవలో మంగళవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతు కూలీల కొరత ఉన్నందున వరినాట్లు వేసే యంత్రం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఎకరా విస్తీర్ణంలో వరి నాట్లు వేయడానికి ఈ యంత్రం ద్వారా రూ.4 వేల వరకు ఖర్చు అవుతుందన్నారు. రోజుకు 6–8 ఎకరాల్లో వరినాట్లు వేసుకోవచ్చని చెప్పారు. రైతులకు పలు సలహాలు, సూచనలు అందించారు. ఏడీఏలు డీఆర్‌సీ సుబ్రహ్మణ్యం, హరికృష్ణ, మాణిక్యాంబ, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, ఏఈవో ఎస్.రమణ, ఎంపీఈవో టి.లోకేశ్వరి, రైతులు పాల్గొన్నారు.